క్లుప్తంగా

'పది' టాపర్లకు సన్మానం



సన్మానిస్తున్న గుర్రం మోహన్‌రెడ్డి

జన్నారం: పదోతరగతి ఫలితాల్లో మండల టాపర్లుగా నిలిచిన మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాథోడ్ యోగేశ్వర్, వేల్పుల నరేందర్‌ను మంగళవారం రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం దేవుని గూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రం జలందర్‌రెడ్డి, నాయకులు గుర్రం రాజశేఖర్ రెడ్డి, క్లాం శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఏఐవైఎఫ్ మహాసభలు విజయవంతం చేయాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఈనెల 15 నుంచి 18 వరకు ఏపీలోని తిరుపతిలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొంకుల రాజేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు మామిడాల సత్యం, కార్యవర్గ సభ్యులు సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా నిర్మూలనకు కృషి

మందమర్రిరూరల్: తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రమేశ్ అన్నారు. మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధిని అరికట్టడానికి పెళ్లికి ముందు తప్పనిసరిగా హెచ్‌బీఏ-2 పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తలసేమియా సొసైటీ రాష్ట్ర కార్యదర్శి కాసర్ల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి రంజిత్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

తాండూర్: మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి 24 మందికి కల్యాణలక్ష్మి, ఇద్దరికి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాలిగామ బానయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్.మహేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

జైపూర్: కాన్కూర్ శివారులోని నీలగిరి ప్లాంటేషన్‌లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ పంపిణీ చేసినట్లు డివిజనల్ మేనేజర్ శ్రావణి, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్ తెలిపారు. అనంతరం కాన్కూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీధి సౌరకాంతి సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్యదర్శి ఉపేందర్, ఫీల్డ్ సూపర్‌వైజర్ రాజేశ్, శ్రీనివాస్, వాచర్లు శంకర్, సాయికిరణ్, ఓదెలు, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లిళ్లు, యాత్రలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల నేపథ్యంలో విహారయాత్రలు, శుభకార్యాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడిపించనున్నట్లు డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేటర్) శ్రీహర్ష తెలిపారు. మంగళవారం మంచిర్యాల డిపోలో ఆర్టీసీ సంస్థ ఏప్రిల్ 14నుంచి జూన్ 30వరకు గ్రాండ్ పీక్ సీజన్ చాలెంజ్(జీపీసీ-2025)పై ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లతో సమీక్షించారు. సమ్మర్ సీజన్‌లో కొన్ని ప్రత్యేక మార్గాల్లో, ఎక్కువ డిమాండ్ ప్రాంతాల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం శ్రీనివాసులు, అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవపాల, ఎంఎఫ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా నిఘా

- నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసుశాఖ చర్యలు
- చెన్నూర్ మున్సిపాలిటీలో 540 సీసీ కెమెరాలు
- ప్రధాన రహదారితోపాటు కూడళ్లలో ఏర్పాటు



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీసీ కెమెరా



పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు పర్యవేక్షిస్తున్న అధికారులు

చెన్నూర్: నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు ముందుకు సాగుతున్నారు. అసాంఘిక శక్తులు, ఆకతాయిలకు కళ్లెం వేసేందుకు చెన్నూర్ మున్సిపాలిటీలో అడుగడుగునా నిఘా నేత్రాలు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రధాన కూడళ్లతో పాటు జాతీయ రహదారి, కాలనీల్లో 540 సీసీ కెమెరాలు బిగించారు. చోరీలు, ప్రమాదాలు, ఆకతాయిల ఆగడాలను వెంటనే కనిపెట్టేందుకు సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషించనున్నాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమే కాకుండా పోలీసుస్టేషన్‌లో నిరంతరం పర్యవేక్షిస్తూ నేరాలు అరికట్టడమే కాకుండా ప్రధాన కూడళ్లలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. రెండు నెలల వ్యవధిలో చోరీలతో పాటు ఇతర నేరాలు తగ్గుముఖం పట్టాయి.

మున్సిపాలిటీలో..

చెన్నూర్ మున్సిపాలిటీ సమీపంలో గల జాతీయ రహదారితో పాటు హైవేకు ఉన్న మూడు పెట్రోల్ బంక్‌లు, మినీ ట్యాంక్‌బండ్‌లు, అస్నాద రోడ్డు, తెలంగాణ తల్లి విగ్రహం, ఆదర్శనగర్, లంబాడిపల్లి రోడ్డు పంచముఖ ఆంజనేయ ఆలయం, గాంధీ చౌక్, అంబేడ్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, ఆర్టీసీ ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. పట్టణానికి అపరిచితులు ఎటు నుంచి వచ్చినా, తిరిగి వెళ్లినా వారిని గుర్తించేందుకు కార్నర్‌లలో పోలీసులు నిఘా నేత్రాలను ఏర్పాటు చేయించారు.

ఒక్క సీసీ కెమెరా వందమందితో సమానం..

ఒక్క సీసీ కెమెరా వందమందితో సమానంగా పని చేస్తుంది. ఇందుకు గతంలో జరిగిన నేరాలతో పాటు రెండు నెలల కాలంలో సీసీ కెమెరాలతో చోరీలకు పాల్పడిన వారిని గుర్తించి సొమ్మును రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

ఇటీవలి ఘటనలు

- మార్చి నెలలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును సీసీ కెమెరాతో గుర్తించి దొంగను పట్టుకొని బంగారం రికవరీ చేశారు.
- మార్చి నెలలో జరిగిన మోటర్ సైకిల్ చోరీకి పాల్పడిన వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారిస్తే గతంలో చోరీ అయిన మూడు మోటర్ సైకిళ్లు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు మోటర్ సైకిళ్లను రికవరీ చేశారు.
- గత నెలలో చెన్నూర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎం విధులు ముగించుకొని ఆటోలో ఇంటికి వెళ్లే క్రమంలో నగదుతో పాటు నగలు గల పర్సు పోగొట్టుకుంది. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్రమత్తమైన సీఐ సీసీ కెమెరాను పరిశీలించి పర్సును గుర్తించి బాధితురాలికి అప్పగించారు. ఇవే కాకుండా బహిరంగ మద్యం సేవనం, ప్రధాన కూడళ్లలో ఆకతాయిల ఆగడాలను గుర్తించి తల్లిదండ్రులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు సత్ఫలితాలు ఇస్తోంది.

నిరంతర పర్యవేక్షణ



మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడ అనుమానం వచ్చినా, వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. సీసీ కెమెరాలతో చోరీలు, నేరాలు, ప్రమాదాలను గుర్తించడంతో పాటు మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి. రెండు నెలల కాలంలో సీసీ కెమెరాలతో పలు కేసులు పరిష్కరించాం. సీసీ కెమెరాతో వందశాతం నేరాలను అదుపు చేసే అవకాశం ఉంది. ఆర్థిక స్తోమత ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలి.

– దేవేందర్‌రావు, సీఐ, చెన్నూర్

లబ్ధిదారులతో ఎమ్మెల్యే సహపంక్తి భోజనం



ఎల్లారంలో లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఎల్లారంలో మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు సుర్జాపూర్‌లో బీటీరోడ్డును ప్రారంభించారు. అనంతరం జన్కాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎల్లారం గ్రామానికి వేసిన బీటి రోడ్డును ప్రారంభించారు. కన్నెపల్లి, భీమిని మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు, భీమిని, కన్నెపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, మాజీ జెడ్పీటీసీ అల్లి మోహన్, నాయకులు జలపతి, రోహిత్, చంద్రయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ జెడ్పీటీసీ

కన్నెపల్లి మండల మాజీ జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వినోద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పలకరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ



మార్నింగ్‌వాక్ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం బజారు ఏరియా ప్రధాన రహదారి, పుర వీధులలో మార్నింగ్‌వాక్ చేశారు. సర్దార్ భగత్‌సింగ్ విగ్రహం వద్ద నుంచి పాత బస్టాండ్ వరకు కాలినడకన వెళ్లారు. పురప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారు. సమస్యలు ప్రత్యక్షంగా పరిశీలించారు. 8 గంటల ప్రాంతంలో నిత్యజనగణమన కార్యక్రమం ప్రారంభం కావడంతో పాత బస్టాండ్ చౌరస్తా వద్ద ఆగి స్థానికులతో కలిసి గీతాలాపన చేశారు.

సౌరకాంతి సామగ్రి పంపిణీ



సామగ్రి అందజేస్తున్న మేనేజర్ శ్రావణి

కోటపల్లి: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని శెట్‌పల్లిలో మంగళవారం వీధి సౌరకాంతి సామగ్రిని ఫారెస్టు ప్లాంటేషన్ డివిజనల్ మేనేజర్ శ్రావణి కార్యదర్శి రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అటవీ ప్రాంతంలో పది నీలగిరి ప్లాంటేషన్‌లు నిర్వహిస్తూ పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానికులకు ఉపాధి కల్పిస్తున్న సందర్భంగా గ్రామానికి రూ.36 వేల విలువ చేసే వీధి సౌరకాంత్రి సామగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్‌కుమార్, ఫీల్డ్ సూపర్‌వైజర్లు రాజేశ్, శ్రీనివాస్, వాచర్ లచ్చన్న, సాయికిరణ్, రాకేశ్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి



మాట్లాడుతున్న రాఘవరెడ్డి

కాసిపేట: రాజ్యాంగ పరిరక్షణలో దేశ ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెలంగాణ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్, టీపీసీసీ పరిశీలకులు జంగా రాఘవరెడ్డి అన్నారు. జై బాపు, జై భీమ్, జై సమ్విధాన్ రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. అనంతరం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, నాయకులు శంకర్, పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

శ్రీరాంపూర్: ఈనెల 20న దేశవ్యాప్తంగా జరుపతలపెట్టిన సమ్మె నోటీసును ఏఐటీయూసీ నేతలు మంగళవారం యాజమాన్యానికి అందజేశారు. ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజకుమార్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి కార్యాలయంలో జీఎం(పర్సనల్) కవితా నాయుడును కలిసి అందజేశారు. దేశవ్యాప్త సమ్మె డిమాండ్లతో పాటు సింగరేణి కార్మికుల డిమాండ్లు కూడా సమ్మె పిలుపులో భాగంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు కే.సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, వైవీ రావు, మడ్డి ఎల్లయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకటి, నాయకులు రమణమూర్తి, మల్లికార్జున్, వీరస్వామి పాల్గొన్నారు.

జీఎంకు సమ్మె నోటీసు

శ్రీరాంపూర్: ఈనెల 20న జరుపతలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసులను సీఐటీయూ నాయకులు శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాసుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు వెంగళ శ్రీనివాస్, పెరిక సదానందం, సాయిల్ల శ్రీనివాస్, ప్రతాప్ పాల్గొన్నారు.

20న సమ్మె విజయవంతం చేయాలి

కాసిపేట: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి కోరారు. మంగళవారం మందమర్రి ఏరియా కాసిపేట 1గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, రాజేందర్, పార్వతి సురేష్, లింగయ్య, సంపత్, అనిల్, రంజిత్ కుమార్, అశోక్ తదితరులున్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మె పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులు కాలరాస్తున్నారన్నారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, కార్యదర్శి రాజమణి, సీఐటీయూ జిల్లా కన్వీనర్ దేవదాస్, సునీత, చంద్రకళ, పద్మ, పద్మ, జయసుధ, జయలక్ష్మి, సువర్ణ, పార్వతి, రవి, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శించిన డీఆర్‌డీవో

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

దండేపల్లి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలపై 'ధాన్యం అమ్మకానికి అవస్థలు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీవో కిషన్ మండలంలోని గూడెం, నంబాల, వెల్గనూర్, కొండాపూర్, కాసిపేట, ధర్మరావుపేట, మాదాపూర్, లింగాపూర్, నాగసముద్రం, తాళ్లపేట గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. లారీలు, గన్నీసంచుల కొరత, అన్‌లోడింగ్ ఆలస్యం వంటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట ఏపీఎం బ్రహ్మయ్య, సీసీలు ఉన్నారు.

సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో సింగరేణి హైస్కూల్ రామకృష్ణాపూర్, సోమగూడెం, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల్లో నిర్వహించనున్న 30 రోజుల సమ్మర్ కోచింగ్ క్యాంపును క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ పేర్కొన్నారు. మంగళవారం సింగరేణి హై స్కూల్ మైదానంలో కోచింగ్ క్యాంపును ప్రారంభించి క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సీఎండీ బలరాం ఆదేశాల మేరకు పుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్ కోచ్‌లను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ కార్యదర్శి కార్తీక్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంవోఏఐ ఏరియా అధ్యక్షుడు రమేశ్, పాల్గొన్నారు.

జైపూర్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును సందర్శించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

జన్నారం: దండేపల్లి మండల ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కలమడుగులో ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు వేల్పుల రవీందర్, గుడికందుల హరీష్, నూతన్ కుమార్, ఎఫ్‌ఏ మాధవి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

దండేపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కన్నెపల్లికి చెందిన బందెల రవిగౌడ్‌ను మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గౌడ కులస్తులు రాజకీయాల్లోనూ రాణించాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన సోమశేఖర్‌కు ప్రమాదవశాత్తు భుజం విరిగింది. దీంతో అతని వైద్యఖర్చుల నిమిత్తం అతనితో దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988–89లో పదోతరగతి చదివిన మిత్రులు మంగళవారం రూ.31వేల ఆర్థికసాయం అందించారు.

సమ్మర్ క్యాంపులు ప్రారంభం

భీమారం: మండలంలోని కాజిపల్లి, పోలంపల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులను మంగళవారం ఎంఈవో వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞానాన్ని అందించనున్నట్లు తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు, సీఆర్‌టీ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలు అవాస్తవం'

తాండూర్ : మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల జారీలో డబ్బులు అడిగినట్లు తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని వాటర్ గ్రిడ్ సూపర్ వైజర్ మోబిన్ పేర్కొన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కక్షతోనే తనపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారన్నారు. నల్లా కనెక్షన్ కోసం డబ్బులు అడిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు.

బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు

చెన్నూర్: పహల్గాం ఘటనను నిరసిస్తూ హిందు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన చెన్నూర్ బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య సంస్థలు, హోటళ్ల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

ప్లకార్డులతో నిరసన

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదుట మంగళవారం రైల్వే కార్మికులు, సీఐటీయూ నాయకులు ప్లకార్డులతో నిరన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ మాట్లాడుతూ రైల్వే ప్రైవేటీకరణ జరిగితే సామాన్య ప్రజలకు రైలులో ప్రయాణించే వీలుండదన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల రక్షణకు ఈ నెల 20న చేపట్టిన జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కుంట నిర్మాణ పనులు పరిశీలన

వేమనపల్లి: ఉపాధి కూలి రూ.307 అందేలా కూలీలతో పనులు చేయించాలని ఎంపీడీవో కుమారస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లెడలో ఉపాధి నిధులతో నిర్మిస్తున్న చిన్న నీటి కుంట పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో అన్ని జాబ్‌కార్డుదారులు పనులకు వచ్చేలా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఏపీవో సత్యప్రసాద్, టీఏ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి, కేతన్‌పల్లి, దస్నాపూర్, వేమనపల్లిలో డీసీఎంఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్ అలీ మంగళవారం ప్రారంభించారు. రైతులు దళారులకు ధాన్యం అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలి మధు, ఒడిళ్ల రాజన్న, పున్నం, పురుషోత్తం, తిరుపతి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాశిబిరం సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి: వేసవి ఫుట్‌బాల్ క్రీడా శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం సింగరేణి తిలక్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత ఫుట్‌బాల్ క్రీడా శిబిరాన్ని సందర్శించారు. పీఈటీ , సీనియర్ ఫుట్ బాల్ క్రీడాకారుడు బబ్లూ ఆధ్వర్యంలో క్రీడా శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

క్షయరహిత సమాజానికి కృషి చేయాలి

నెన్నెల: క్షయ రహిత సమాజం కోసం కలిసికట్టుగా కృషి చేయాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో టీబీ నిర్ధారణ ఏసీఎఫ్(యాక్టివ్ కేసు ఫైండింగ్) క్యాంపు వాహన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 50 మందికి క్షయ నిర్ధారణ, 56 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. టీబీని తొలి దశలో గుర్తించి మందులు వాడితే నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్, ఫార్మాసిస్ట్ నారాయణ, సీనియర్ టీబీ సూపర్‌వైజర్ శశికాంత్, సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరునెలల జైలు

మంచిర్యాలక్రైం: చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఆరునెలల జైలు శిక్షతో పాటు అప్పుగా తీసుకున్న రూ.12 లక్షలు చెల్లించాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన సూర్యప్రకాష్‌రావుకు రెబ్బెన మండలం గోలేటిలోని వెంకటేశ సిరమిక్స్ కంపని మేనేజింగ్ పార్టనర్ ప్రసన్న లక్ష్మీదేవి మధ్య వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. ఈక్రమంలో సూర్యప్రకాష్‌కు రూ.12 లక్షల చెక్కును అందజేశారు. అగ్రిమెంట్ ప్రకారం డబ్బులు చెల్లించక పోవడంతో బాధితుడు 2013లో కోర్టును ఆశ్రయించాడు. ఇరువురి వాదన విన్న న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

ఇద్దరిపై కేసు

నెన్నెల: గొర్రెల కాపరిని బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. భీమిని మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి మురికి కత్తెరయ్య బైక్‌పై భీమిని నుంచి చెన్నూర్ వైపు వెళ్తుండగా బట్వాన్‌పల్లికి చెందిన జాడి సాగర్‌తో పాటు మరోవ్యక్తి స్కూటీపై వచ్చి బూతులు తిట్టి చంపుతానని బెదిరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురు అరెస్టు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ సుందరయ్య కాలనీలో మంగళవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. కాలనీలోని ఇరుగాదిండ్ల రవి ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి రూ.26,770 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న వారిలో ఇరుగాదిండ్ల రవి, సల్లూరి రాజ్‌కుమార్, కలకోట శ్రీనివాస్, ఇరుగాదిండ్ల కిషోర్, లగిశెట్టి సాయికుమార్, బొజ్జం రాజు ఉన్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీపతి నగర్ ఏరియాలో సెల్ టవర్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగిలి ఆవు మృతి చెందింది. కొలకాని రాజుకు చెందిన ఆవు మంగళవారం మేత కోసం వెళ్లి తిరిగి వస్తుండగా కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందింది. ఆవు విలువ రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.